ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

- ప్రతిపక్షాల విషప్రచారాన్ని తిప్పికొట్టాలి
- కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

జి.సిగడాం: వచ్చే ఎన్నికల్లోనూ జగనన్న గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, కన్వీనర్లు, గృహసారథులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు సైనికుల్లా పని చేయాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం జి.సిగడాం మండల కేంద్రంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఒక్కరూ సమన్వయంతో మెలిగి పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. ఎన్నికల హామీల్లో 98 శాతం అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. పేదలకు మేలు జరగకుండా ఉండేందుకు తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు విష ప్రచారాలు చేస్తున్నారని, వాటిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. జగనన్న అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి పథకాలను అధిక శాతం మీడియా ప్రజలకు చూపకపోవడం మంచి పద్ధతి కాదన్నారు. గత ఎన్నికల్లో చంద్రబాబు 600 హామీలు ఇచ్చారని, ఒక్క హామీ అయినా అమలు చేశారా అని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీతోనే అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, మండల పార్టీ అధ్యక్షుడు బూరాడ వెంకటరమణ, జేఎస్ఏ కన్వీనర్ డోల వెంకటరమణ, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మక్క వెంకటిసాయి, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, మీసాల రాంబాబు, నాయకులు మామిడి బలరాం, బత్తుల సన్యాసిరావు, పల్లేటి సన్యాసిరావు, కలిశెట్టి శాంతారావు, పేడాడ శ్రీరామమూర్తి, పిల్లల శివకుమార్, సర్పంచులు ముద్దాడ గౌరీ, సాకేటి నాగరాజు, బుడారి లక్ష్మణరావు, వడిశ మహేశ్వరరావు, చందక సతీష్, తొత్తడి రామారావు, భూపతి సురేష్‌కుమార్, శ్రీనివాసరావు, బొల్లా జనార్దనరావు, నల్లి తవిటినాయుడు, పున్నాన అక్కలనాయుడు, చండీ ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు కుమరాపు రమేష్ నాయుడు, వెలిది సాయిరాం, కీర్తి తవుడమ్మ, నారాయణరావు, కోటేశ్వరరావు, ధారబోయిన ధర్మారాజ్, కోరాయి అప్పారావు, చిక్కాల ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్


సమావేశానికి హాజరైన కార్యకర్తలు

క్లుప్తంగా

నేడు కుశాలపురంలో గడప గడపకు మన ప్రభుత్వం

ఎచ్చెర్ల క్యాంపస్: కుశాలపురంలో బుధవారం ఉదయం 6 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందని పార్టీ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి.

నేడు గార మండలంలో విద్యుత్ అంతరాయం

అరసవల్లి/గార: ఇటీవల గార మండలం చల్లపేట సబ్‌స్టేషన్‌లో 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో ప్రత్యామ్నాయంగా తూలుగు సబ్‌స్టేషన్‌లో ఉన్న రెండో పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను చల్లపేట సబ్‌స్టేషన్‌లో అమర్చాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో భాగంగా అటు తూలుగు సబ్‌స్టేషన్, ఇటు చల్లపేట సబ్‌స్టేషన్ల పరిధిలో అన్ని గ్రామాల్లోనూ బుధవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లుగా ఆపరేషన్స్ ఈఈ బయ్యన్నాయుడు, డిప్యూటీ ఈఈ బి.రాంబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు గార మండల వినియోగదారులు సహకరించాలని కోరారు.

టౌన్‌హాలులో వైద్య శిబిరం


వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్ సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం టౌన్ హాలులో రక్తదాన శిబిరం, ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జెమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో పార్టీ నాయకులు పుట్రేవు రవిశంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కళింగ కోమటి చైర్మన్ అంధవరపు సూరిబాబు, డాక్టర్ శ్రీనివాస్ పట్నాయక్, గంగు నరేంద్రకుమార్, చౌదరి సతీష్, ప్రకాశ్ రామ్మోహన్ పాల్గొన్నారు.

ర్యాబిస్ రహిత నగరంగా శ్రీకాకుళం


శ్రీకాకుళం: సమీక్షిస్తున్న కమిషనర్ ఓబులేసు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ర్యాబిస్ రహిత నగరంగా శ్రీకాకుళాన్ని తీర్చాదిద్దాలనే లక్ష్యంతో గ్రీన్‌మెర్సీ సంస్థ, నగరపాలక సంస్థ సంయుక్తంగా ఏబీసీ, వీఆర్‌వీ కార్యక్రమాన్ని నగర కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేషు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధి కుక్కల నియంత్రణకు జూలైలో చేపట్టిన చర్యలు వివరించారు. 454 వీధి కుక్కలకు సంతాన నిరోధక ఆపరేషన్లు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరావు, పాలీ క్లినిక్ వైద్యులు వై.వి.కృష్ణారావు, వెట్ సర్జన్ హేమంత్‌కుమార్, గ్రీన్‌మెర్సీ సీఈవో రమణమర్తి పాల్గొన్నారు.

ఓటరు జాబితాకు సహకరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో బొడ్డేపల్లి శాంతి

శ్రీకాకుళం రూరల్: కొత్తగా రూపొందించనున్న ఓటర్ జాబితాకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని శ్రీకాకుళం ఆర్డీవో బొడ్డేపల్లి శాంతి కోరారు. శ్రీకాకుళం తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొద్దిరోజులుగా ఇంటింటా సర్వే చేపడుతున్నామని, మార్పులు చేర్పుల వివరాలను రాజకీయ పార్టీలకు వివరించారు. సమావేశంలో తహసీల్దార్ వెంకటరావు, డిప్యూటీ తహసీల్దార్లు రాజు, హేమసుందర్, నాయకులు పాల్గొన్నారు.

బస్ సౌకర్యం కల్పించాలని వినతి


ఆర్టీసీ అధికారులకు రూట్ మ్యాప్ వివరిస్తున్న సర్పంచ్ ఆదిత్యనాయుడు

శ్రీకాకుళం రూరల్: సింగుపురం గ్రామంలోకి ఆర్‌టీసీ బస్సు వచ్చేలా అవకాశం కల్పించాలని సర్పంచ్ గుండ ఆదిత్యనాయుడు మంగళవారం ఆర్‌టీసీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఇటీవల జగనన్నకు చెబుదాం గ్రీవెన్స్‌లో ఆయన ఫిర్యాదు చేయడంతో గ్రామంలో రూట్ పరిశీలించేందుకు వచ్చారు. బస్సు వచ్చేలా చూడాలని స్థానికులంతా విన్నవించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేష్ ఉన్నారు.

మణిపూర్ ఘటన పునరావృతం కాకూడదు

శ్రీకాకుళం: మణిపూర్ ఘటన పునరావృతం కాకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ చైర్మన్ సాహూ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఏడురోడ్ల కూడలిలో మంగళవారం మణిపూర్ ఘటనను నిరసిస్తూ మంగళవారం విద్యార్థులతో శాంతిర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణిపూర్‌లో మూడు నెలలు దాటినా ఇంకా అల్లర్లు జరుగుతున్నాయని చెప్పారు. శాంతి నెలకొల్పేలా కేంద్రం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఏ.నాగేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు ఎ.ఇమ్మాన్యుయేల్, మంత్రి వెంకటస్వామి, మణికంఠ, జోయ్ ప్రసాద్, సుధా, విజయ్ కుమార్, ప్రమ్ కుమారి, తదితరులు పాల్గొన్నారు.


స్కూల్‌లో విద్యార్థులతో ప్రమాణం చేయిస్తున్న దృశ్యం

ఎమ్మెల్యేకు సన్మానం


కిరణ్‌కుమార్‌ను సత్కరిస్తున్న నాయకులు

లావేరు: తామాడకు చెందిన పరపతి గొల్లబాబును ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌గా నియమించడం పట్ల కృతజ్ఞతలు తెలియజేస్తూ తామాడ పంచాయతీ మాజీ సర్పంచ్ పాలిశెట్టి మధుబాబు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు మంగళవారం ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌ను క్యాంపు కార్యాలయంలో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు పాలిశెట్టి మల్లిబాబు, దండా హరీష్, కోరాడ వల్లప్పడు, కాపల రాము, టి.ఎంకులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవాళి మనుగడ

లావేరు: మానవాళి మనుగడకు మొక్కలు ఎంతగానో దోహదపడతాయని బుడుమూరు హైస్కూల్ హెచ్‌ఎం ఉరిటి శ్రీనివాసరావు, ఏపీ నేషనల్ గ్రీన్ కోర్ క్లస్టరు కోఆర్డినేటర్ పూజారి గోవిందరావు అన్నారు. బుడుమూరు హైస్కూల్ ఆవరణలో మంగళవారం నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో హెచ్‌ఎం, కోఆర్డినేటర్, ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీ ఎం.రమేష్, జూనియర్ రెడ్‌క్రాస్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు

కొయ్యాంలో అసిరితల్లి ఉత్సవాలు


అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని కొయ్యాం గ్రామంలో మంగళవారం అసిరితల్లి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ పంచాయతీ పరిధిలోని అనుబంధ గ్రామాల ప్రజలు పూజల్లో పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌కు ఎమ్మెల్యే పరామర్శ

జి.సిగడాం: నిద్దాం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, జి.సిగడాం సహకార సంఘం చైర్మన్ ఏర్నేన ప్రకాశరావు కోడలు ప్రశాంతి ఇటీవల గుండెపోటుతో మృతి చెందింది. ఆమె కుటుంబాన్ని మంగళవారం ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, లావేరు సహకార సంఘం చైర్మన్ బూరాడ చిన్నారావు, మంతిన శ్రీనివాసరావు మంగళవారం పరామర్శించారు.


ప్రకాశరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న కిరణ్‌కుమార్

లలితా దేవికి ప్రత్యేక పూజలు



ఎచ్చెర్ల క్యాంపస్/ఎచ్చెర్ల: మండలంలోని కేకేనాయుడుపేటలో లలితా దేవి ఆలయంలో మంగళవారం శ్రావణశుద్ధి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు.

ఆక్రమణల తొలగింపు

రణస్థలం: మండల కేంద్రం రణస్థలంలో సూర్య ప్రయివేటు పాఠశాల యాజమాన్యం ఆక్రమించిన ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ అధికారులు మంగళవారం జేసీబీతో తొలగించారు. ఈ సందర్భంగా గ్రామ రెవెన్యూ అధికారి లుకలాపు అప్పలనాయుడు మాట్లాడుతూ పాఠశాల ప్రహరీ నిర్మాణంలో భాగంగా రహదారిని ఆక్రమించినట్లు స్థానికుల నుంచి ఫిర్యాదు వచ్చిందని చెప్పారు. ఈ మేరకు మండల సర్వేయర్ ఎస్.రవికుమార్ కొలతలు వేసి హద్దులు నిర్ణయించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా జేసీబీతో ఆక్రమణలు తొలగించామన్నారు. కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయ జిల్లా సర్వేయర్ల సంఘ అధ్యక్షుడు బూరాడ మధుబాబు పాల్గొన్నారు.


ఆక్రమణలు తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

ఇంటింటి సర్వేకు సహకరించండి

రణస్థలం:

కేంద్ర, రాష్ట్ర ఎన్నికల అధికారుల ఆదేశాల ప్రకారం అన్ని పార్టీల ఆమోదంతో ఇంటింటికి ఓటరు నమోదు సర్వే జరుగుతోందని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఎచ్చెర్ల నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి పి.మురళీ కృష్ణ తెలిపారు. రణస్థలం తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం అన్ని పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితాపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ జాబితాలో తొలగింపులు, సవరణలు, చేర్పుల జాబితాను పార్టీల ప్రతినిధులకు అందించామని, అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరారు. ఒక కుటుంబానికి సంబంధించిన ఓట్లు ఒకే బూత్‌లో వచ్చేలా యాప్‌లో నమోదు చేస్తున్నామని చెప్పారు. అనంతరం వివిధ పార్టీల ప్రతినిధుల సలహాలు, సూచనలు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో రణస్థలం, లావేరు, జి.సిగడాం, ఎచ్చెర్ల తహసీల్దార్లు సనపల కిరణ్ కుమార్, దిలీప్ చక్రవర్తి, పప్పల వేణుగోపాల్, టి.సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ జి.కె.శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.


రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన ఎస్‌డీసీ మురళీకృష్ణ

విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలని వినతి

జి.సిగడాం: మండలంలోని గెద్దకంచరాం నుంచి గదబపేట వరకు నూతన విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలని మాజీ సర్పంచ్ నక్క ప్రసాదరావు, ఎంపీటీసీ సభ్యులు పరసరావు మంగమ్మ నారాయుడు, గ్రామస్తులు మంగళవారం విద్యుత్ శాఖ ఏఈఈ జి.తిరుపతిరావుకు విన్నవించారు. విద్యుత్ లైన్ల ఏర్పాటుకు నిధులు మంజూరైందని, తక్షణమే విద్యుత్ పనుల కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. అనంతరం ఏఈ స్పందిస్తూ ప్రతిప్రాదనలు తయారు చేసి అధికారులకు అందిస్తామన్నారు.


ఏఈఈతో మాట్లాడుతున్న ప్రసాదరావు

మోడల్ అంగన్‌వాడీ కేంద్రంగా రామజోగిపేట


కేంద్రానికి అందజేసిన ఫైబర్ ఫర్నిచర్

ఎచ్చెర్ల క్యాంపస్: రామజోగిపేట అంగన్‌వాడీ కేంద్రానికి మంగళవారం ఫైబర్ ఫర్నీచర్‌ను ఐసీడీఎస్ అధికారులు అందజేశారు. మోడల్ అంగన్‌వాడీ కేంద్రంగా గుర్తించి రూ.ఐదు లక్షలు మంజూరు చేశారు. ఇందులో భాగంగా ఫర్నిచర్‌తో పాటు మరుగుదొడ్ల ఏర్పాటు, ప్లంబింగ్, విద్యుత్ వైరింగ్, చిన్నారులను ఆకట్టుకునే బొమ్మలతో కూడిన రంగులు, గ్రిల్స్ వంటివి ఏర్పాటు చేస్తున్నారు.

చినకొంగరాంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని చినకొంగరాం రామ మందిరంలో మంగళవారం తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. వేద పండితులు శాస్త్రోక్తంగా పూజలు జరిపించారు. అధిక సంఖ్యలో దంపతులు, గ్రామపెద్దలు, టీటీడీ నిర్వాహకులు పాల్గొన్నారు.


వ్రతాలు చేస్తున్న భక్తులు

వైభవంగా శ్రీచక్ర సిరిజ్యోతి పూజలు



బలగ నాగావళి తీరాన ఉన్న బాల త్రిపుర కాల భైరవాలయంలో పౌర్ణమి సందర్భంగా శ్రీచక్ర సిరిజ్యోతి పూజలు వైభవంగా నిర్వహించారు. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో మహిళలు శ్రీచక్రం చుట్టూ దీపాలు వెలిగించారు.

- శ్రీకాకుళం కల్చరల్

ఎంబీసీల చట్టాలు అమలు చేయాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: మోస్ట్ బ్యాక్‌వర్డ్ కేస్టు (ఎంబీసీ) కులాల సంక్షేమం కోసం ప్రభుత్వం పలు పథకాలు, చట్టాలు తీసుకువచ్చిందని, ఆ చట్టాలు పూర్తి స్థాయిలో అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఎంబీసీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ పెంద్ర వీరన్న అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం బీసీ కార్పొరేషన్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంబీసీల కోసం చట్టాలు అమలు చేయాలని, ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకోవాలని కోరారు. కొన్ని కులాల పేరిట తిట్లు, దూషణలు వస్తున్నాయని, వాటిని అరికట్టాలన్నారు. అనంతరం వీరన్నను బీసీ కార్పొరేషన్ ఈడీ ఆర్.గడ్డెమ్మ సత్కరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖాధికారి ఈ.అనురాధ, జంగం కుల జిల్లా అధ్యక్షుడు సూరిబాబు, ఎంబీసీ నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంబీసీ అధ్యక్షుడు పెంద్ర వీరన్న

వీవోఏల సమస్యలు పరిష్కరించాలి

ఎచ్చెర్ల/ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్ర ప్రభుత్వం వెలుగు వీవోఏల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, సీబీవో హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అల్లు మహాలక్ష్మీ డిమాండ్ చేశారు. మంగళవారం ఎచ్చెర్లలో నిర్వహించిన వీవోఏల సమావేశంలో ఆమె మాట్లాడారు. వెలుగులో అనేక ఏళ్లుగా పని చేస్తున్నా కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత లేకపోవడం విచారకరమన్నారు. కాలపరిమితికి సెక్యులర్‌ను తీసుకొచ్చి తొలగింపులకు పాల్పడుతున్నారని చెప్పారు. తెలంగాణా మాదిరిగా సీబీవో హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీవోఏల మండల నాయకులు జి.అరుణ, కె.సరిత, బి.కనకమహాలక్ష్మీ, ఏ.సుజాత, జె.లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న వీవోఏలు

చట్టాలపై అవగాహన అవసరం

రణస్థలం: చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని శ్రీకాకుళం సబ్ డివిజన్ టీమ్ ఇన్‌చార్జి కె.రామరాజు అన్నారు. ఎస్పీ జి.ఆర్.రాధిక ఆదేశాల మేరకు రణస్థలం ఆదర్శ పాఠశాలలో మంగళవారం బాలికల భద్రతే మా ధ్యేయం అనే నినాదంతో విద్యార్థులకు చైతన్య స్ఫూర్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళ భద్రతకు దిశ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. యుక్త వయస్సులో తొందరపాటు నిర్ణయాల వల్ల భవిష్యత్ నాశనం అవుతుందని, తల్లిదండ్రుల మాట వినాలని హితవుపలికారు. సోషల్ మీడియా, సెల్‌ఫోన్లు విజ్ఞానాన్ని పెంచేలే ఉండాలి తప్పా చెడు అలవాట్లకు దాసోహం కాకూడదన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పి.కృష్ణ, సతీష్‌కుమార్, స్రవంతి, వసంత, రమణకుమార్, హరిప్రసాద్, వెంకటరమణ, వాసుదేవరావు, గుణ, ఎల్ఎస్ చలపతి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న టీం ఇన్‌చార్జి రామరాజు

రక్తదాన శిబిరాలు నిర్వహించండి

శ్రీకాకుళం కల్చరల్ : రక్తదాన శిబిరాలు ఎక్కువగా నిర్వహించి ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆదివారంపేటలో చక్రధర్ విద్యాసంస్థల అధినేత చక్రధరరావు జన్మదినం సందర్భంగా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని జేసీ ప్రారంభించారు. విద్యార్థులకు బ్లడ్ గ్రూప్ కార్డులు అందచేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ చక్రధర్, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, సెట్‌శ్రీ మేనేజర్ అప్పలనాయుడు, అకౌంటెంట్ రమణ, రెడ్‌క్రాస్ ప్రతినిధులు కె.సత్యనారాయణ, పి.చైతన్యకుమార్, ఎం.కల్యాణ్‌చక్రవర్తి, బి.చిన్మయరావు తదితరులు పాల్గొన్నారు.


రక్తదాన శిబిరంలో పాల్గొన్న జేసీ నవీన్



